సాక్షి వరంగల్

7

బుధవారం । 22 । మార్చి । 2023



గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

ఏపీ రాష్ట్రం నుంచి తెలంగాణకు గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు స్మగ్లర్లను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ పి.సీతారాం తెలిపారు. - 8లో▸



బ్రహ్మయ్య జాతరకు వేళాయె..

గవిచర్ల గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా గుండ బ్రహ్మయ్య జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. - 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$33^0/23^0$

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. పొడి వాతావరణం ఉంటుంది. రాత్రిపూట చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'రైతులకు నష్టపరిహారం అందించాలి'



నర్సంపేట: పరామర్శలు పక్కనపెట్టి.. అకాల వర్షం, వడగళ్లతో పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం పట్టణంలోని ఓంకార్ భవన్‌లో మంగళవారం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ చేతికొచ్చే దశలోనే మొక్కజొన్న, మిర్చి, కూరగాయలు, పండ్ల తోటలు పనికి రాకుండా పోయాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. వెంటనే రైతులను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టాలని, మిర్చి ఎకరాకు రూ.లక్ష, మొక్కజొన్నకు రూ.25వేలు, వరికి రూ.20వేలు, ఇతర పంటలకు రూ.20వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి కుసుంబ బాబురావు, గౌరవ అధ్యక్షుడు నాగెల్లి కొమురయ్య, కోశాధికారి సింగతి మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు కేశెట్టి సదానందం, సహాయ కార్యదర్శి గోనె రామచందర్, జిల్లా కమిటీ సభ్యులు బుడిమే సురేందర్, హనుమాన్ల రమేశ్, నాయకులు సోమిడి రవి, సాంబయ్య పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

కాశోజీ సెంటర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించడానికి ఈనెల 24న ములుగు రోడ్డులోని ఐటీఐ ప్రాంగణంలో గల జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎం.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ నగరంలో పనిచేయడానికి దాదాపు 20 ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 11 గంటలకు హాజరుకావాలని కోరారు. పూర్తి సమాచారం కొరకు 99482 53893, 77993 14685 నంబర్లలో చేయవచ్చని పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

వరంగల్ రూరల్: జిల్లాలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతుల సమస్యలు, ఇబ్బందులు తెలిపేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ సమస్యలను తెలపడానికి నంబర్లు 180042 53424, 91542 52936కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్‌లో 24గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

వావ్.. 'గాలం' వాలుగ..!



ఖానాపురం: సరదాగా చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తికి పెద్ద చేప చిక్కింది. ఖానాపురం మండల కేంద్రం శివారు పాకాల వాగు వద్ద సోమవారం సాయంత్రం నర్సంపేట పట్టణానికి చెందిన ఏకాంబ్రం అనే వ్యక్తి సరదాగా చేపలు పట్టేందుకు వచ్చాడు. బిట్‌కాస్టింగ్ రాడ్‌కు అమర్చిన గాలం వేయగా.. సుమారు 15 కిలోల బరువున్న వాలుగ చేప చిక్కింది. ఆ చేపను చూసి ఏకాంబ్రం ఆనందం వ్యక్తం చేశాడు.

విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూస్తాం..

- ట్రాన్స్‌కో సీఎండీ గోపాల్‌రావు



నర్సంపేట రూరల్: ఈదురు గాలులు, వడగళ్ల వానతో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వెంటనే మరమ్మతు చేసి అంతరాయం లేకుండా విద్యుత్ అందిస్తామని ట్రాన్స్‌కో సీఎండీ గోపాల్‌రావు అన్నారు. గురిజాల గ్రామంలో రెండు రోజుల క్రితం కురిసిన వడగళ్ల వానకు దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను మంగళవారం ఆయన పరిశీలించారు. డివిజన్‌లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, లైన్లపై పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేయాలని సూచించారు. అనంతరం సర్పంచ్ గోడిశాల మమతసదానందం ఆధ్వర్యంలో సీఎండీకి వినతిపత్రం అందించారు. గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, హెల్పర్, లైన్‌మెన్‌ను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ మధుసూదన్‌రావు, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో లైబ్రరీలు!

- హనుమకొండ జిల్లాలో 153, వరంగల్ జిల్లాలో 144 పీఎస్, యూపీఎస్‌లలో గ్రంథాలయాలు
- విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు దోహదం
- ఒక్కో పాఠశాలకు 252 పుస్తకాలు
- అందుబాటులో కథలు, బొమ్మలు, విజ్ఞానదాయక పుస్తకాలు



వరంగల్ నగరంలోని ప్రభుత్వ ప్రాక్టిసింగ్ పాఠశాల లైబ్రరీలో చదువుతున్న విద్యార్థులు

విద్యారణ్యపురి: వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో లైబ్రరీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో చదివే 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు వారి స్థాయికి తగినట్లుగా కథలు, బొమ్మల పుస్తకాలతోపాటు వివిధ రకాల విజ్ఞానదాయక పుస్తకాలు అందుబాటులో ఉంచనున్నారు. ఇలా ఒక్కో పాఠశాలకు 252 రకాల పుస్తకాలు ఇస్తున్నారు. ఈ మేరకు పాఠశాలలోని ఓ గదిని చదువుకునేందుకు అనువుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఉన్న చోట పుస్తకాలు అరకొరగా ఉన్నాయి. వాటి నిర్వహణ కూడా అంతంతమాత్రమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే పాఠశాలల్లో లైబ్రరీల ఏర్పాటుకు ఉపక్రమించింది. హనుమకొండ జిల్లాలో 153, వరంగల్ జిల్లాలో 144 ప్రాథమిక (పీఎస్), ప్రాథమికోన్నత (యూపీఎస్) పాఠశాలలను ఎంపిక చేసి లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నారు. రూమ్ టు రీడ్, నేషనల్ బుక్‌ట్రస్టు సహకారం తీసుకున్నారని సమాచారం. ఇప్పటికే కొన్ని పాఠశాలలకు పుస్తకాలు కూడా వచ్చాయి. ప్రతీ పాఠశాలలో లైబ్రరీ గదికి ఒక కార్పెట్, పుస్తకాలను పెట్టుకునేందుకు ఉడెన్ ర్యాక్ కూడా అందజేస్తున్నారు.

రేపు తొలివిడతగా కొన్ని పాఠశాలల్లో ప్రారంభం

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఎంపిక చేసిన 297 పాఠశాలల్లో లైబ్రరీలు ఏర్పాటు చేయనుండగా.. తొలివిడతగా హనుమకొండ జిల్లాలో ఐదు పాఠశాలల్లో, వరంగల్ జిల్లాలో ఒక పాఠశాలలో ఈనెల 23వ తేదీన ప్రజాప్రతినిధులను ఆహ్వానించి ప్రారంభించనున్నారు. అందులో హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టిసింగ్ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ మార్కజీ, వడ్డెపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, వంగపహాడ్‌లోని ప్రాథమిక పాఠశాల, గీసుకొండ మండలం గొర్రెకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉన్నాయి.

పుస్తక పఠనం పెంచేందుకు..

విద్యార్థి దశనుంచే పుస్తక పఠనం పెంచేందుకు ఈ లైబ్రరీలు ఉపయోగపడతాయని, పాఠ్యపుస్తకాలే కాకుండా బాలలకు సంబంధించిన పుస్తకాలు చదవడం వల్ల వారి ఆలోచనా సరళిలో మార్పులు వస్తాయని భావిస్తున్నారు. విరామ సమయంలో ఆ లైబ్రరీ గదిలో తమకు ఆసక్తి ఉన్న ఆయా పుస్తకాలను చదువుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాల్సి ఉంటుంది. అందుకే హనుమకొండ జిల్లాలోని 153 పాఠశాలల నుంచి ఒక్కో ఉపాధ్యాయుడికి ఆ లైబ్రరీ నిర్వహణ ఎలా చేయాలి.. విద్యార్థులు ఆయా పుస్తకాలు వినియోగించుకునేలా శ్రద్ధ తీసుకోవాలనే విషయంపై మంగళవారం 53 పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు. మిగతా పాఠశాలల వారికి కూడా త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రజల వద్దకు బీఆర్ఎస్ నేతలు!

ఆత్మీయ సమ్మేళనాలతో ముందుకు

- కార్యకర్తలతో విస్తృత సమావేశాలు
- ఏప్రిల్ 24లోగా పూర్తయ్యేలా కార్యాచరణ..
- ఉమ్మడి వరంగల్ నేతలతో మంత్రి ఎర్రబెల్లి సమీక్ష



రెండు జిల్లాల ఇన్‌చార్జ్ ఎంఎస్ ప్రభాకర్‌తో కలిసి సమావేశమైన మంత్రి దయాకర్‌రావు

సాక్షిప్రతినిధి, వరంగల్: బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా కార్యకర్తలను ప్రజల్లోకి పంపించేందుకు ఆ పార్టీ అధిష్టానం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను ప్రజలకు వివరించే కార్యక్రమంలో కార్యకర్తలందరినీ భాగస్వాములను చేయనున్నారు. ఆయాచోట్ల చేపట్టిన పనులు, అమలు చేసిన పథకాల వివరాలను ప్రజలకు వివరించాలని అధిష్టానం ఆదేశించింది. ఇందుకోసం కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం పేరిట గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో, వార్డుల్లో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది.

నేతల భాగస్వామ్యం.. పథకాలపై ప్రచారం

గ్రామ కమిటీ అధ్యక్షులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, రైతుబంధు కన్వీనర్, సింగిల్ విండో చైర్మన్‌లతోపాటు ఆయా జెడ్పీటీసీ, ఎంపీపీ, మండల పార్టీ కార్యవర్గం, అనుబంధ సంఘాలు, కార్పొరేషన్ చైర్మన్లు అందరితో ఈ సమావేశం నిర్వహించనున్నారు. సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉండే ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, ఇతర పదవులున్న నేతలందరినీ ఆహ్వానిస్తారు. పురపాలక సంఘాల్లో కౌన్సిలర్, పార్టీ వార్డు అధ్యక్షుడు, ఇతర కార్యవర్గాన్ని భాగస్వామ్యం చేయనున్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు సమావేశాల్లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారు. పది గ్రామాలను కలిపి ఒక ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తారు. అదే పట్టణాల్లో 3 నుంచి 4 వార్డులను కలిపి ఓ సమ్మేళనం ఉంటుంది. ఆయా గ్రామాల నుంచి వచ్చే కార్యకర్తలకు అక్కడ చేపట్టిన అభివృద్ధిని గణాంకాలతో సహా వివరిస్తారు. పథకాలతో లబ్ధిపొందిన వారి జాబితాను అందిస్తారు.

ఏప్రిల్ 24 వరకు గడువు...

ఏ గ్రామ కార్యకర్తల సమ్మేళనం ఏ తేదీన నిర్వహిస్తారో నియోజకవర్గ ఎమ్మెల్యే నిర్ణయించాల్సి ఉంటుంది. వివరాలను పార్టీ జిల్లా ఇన్‌చార్జ్‌లకు అందజేస్తే అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలకనుగుణంగా సమావేశాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 24లోగా ఈ సమ్మేళనాలు పూర్తిచేయాలి. అనంతరం 25న గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ జెండాలు ఎగురవేసి పండుగ వాతావరణం తలపించేలా కార్యక్రమం చేపట్టాలని సూచనలున్నాయి. కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాల విజయవంతం కోసం పార్టీ జిల్లా ఇన్‌చార్జ్‌లు ఆయా జిల్లాలకు చేరుకొని నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ అనుబంధ విద్యార్థి విభాగానికి చెందిన విద్యార్థులను ఇందులో ఎక్కువ సంఖ్యలో చేర్పించనున్నారు.

సమ్మేళనాలు ఘనంగా నిర్వహించాలి : మంత్రి ఎర్రబెల్లి

ఉమ్మడి జిల్లాలో జరిగే ఆత్మీయ సమ్మేళనాల్లో సీఎం కేసీఆర్ సందేశం ప్రతీ కార్యకర్తకు చేరాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల, మండలాల, నియోజకవర్గ స్థాయిలవారీగా నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాలు, వాటి ఏర్పాట్లపై ఉమ్మడి వరంగల్ ముఖ్య నేతలతో ఇన్‌చార్జ్ ఎంఎస్.ప్రభాకర్‌తో కలిసి మంత్రి మంగళవారం హనుమకొండ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. దేశంలో మోదీ ప్రభుత్వ హయాంలో పెరిగిన పెట్రోల్‌తోపాటు నిత్యావసర సరుకుల ధరలు, కేంద్ర ప్రభుత్వ విధానాల వైఫల్యాలు, దేశ ప్రజలతోపాటు తెలంగాణ రాష్ట్రానికి చేసిన అన్యాయాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, హనుమకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్, ఎమ్మెల్యేలు రాజయ్య, ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీష్‌కుమార్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వాసుదేవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, మార్నేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వడం రాష్ట్రంలోనే మొదటిసారి

- పంటల పరిశీలనకు త్వరలోనే నర్సంపేటకు సీఎం కేసీఆర్
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



రైతులకు చెక్కు అందజేస్తున్న మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పెద్ది, కలెక్టర్ ప్రావీణ్య తదితరులు

నర్సంపేట: గత ఏడాది అకాల వర్షాలతో నర్సంపేట నియోజకవర్గంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడం రాష్ట్రంలోనే మొదటిసారి అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పట్టణంలో గత ఏడాది అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు రూ.8,89,43,054 చెక్కులను మంగళవారం మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో వడగళ్ల వానతో వేలాది మంది రైతుల పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఇంత నష్టం జరిగినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. బీజేపీ, కాంగ్రెస్ వారు అంతివ్వాలి.. ఇంతివ్వాలని బాగా మాట్లాడుతున్నారని, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటకలో భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వకుండా తప్పించుకున్నారన్నారు. ఇక్కడి ప్రాంత నాయకులు కూడా పిచ్చికూతలు కూయడం సరికాదన్నారు. మొన్న కురిసిన వడగళ్ల వానకు ఉమ్మడి జిల్లాలో 71 వేల మంది రైతులు 1,11,235 ఎకరాల్లో పంటలు నష్టపోయాయన్నారు. జరిగిన నష్టాన్ని స్వయంగా పరిశీలించడానికి నర్సంపేటకు త్వరలో సీఎం కేసీఆర్ రానున్నట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం నష్టపోయిన రైతాంగానికి పరిహారం అందజేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు అందించాల్సిన పరిహారంలో కేంద్ర ప్రభుత్వం 60:40 నిష్పత్తి చొప్పున ఇవ్వాలన్నారు. అయితే కేంద్రం ఎలాంటి నిధులు ఇవ్వకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే రైతులకు పరిహారం అందజేస్తుందన్నారు. ఎలాంటి పక్షపాతం లేకుండా పరిహారం అందించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రావీణ్య, జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, రైతుబంధు కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'పాలకుల విధానాలతోనే అఘాయిత్యాలు'

నర్సంపేట: పాలకుల పెట్టుబడిదారీ అనుకూల విధానాలతోనే మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఏఐఎఫ్‌డీబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగల రాగసుధ అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'మహిళా హక్కుల రక్షణ' అనే అంశంపై మంగళవారం పట్టణంలోని మార్క్స్ కాలనీలో డివిజన్ అధ్యక్షురాలు జమున అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాగసుధ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుతున్నామని చెబుతున్న పాలక వర్గాలు.. మహిళలు, యువతులు, పసి పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, హత్యలను కట్టడి చేయడంలో విఫలమయ్యారన్నారు. మహిళా సంఘం జిల్లా, డివిజన్ నాయకులు గణిపాక బిందు, చొప్పరి పద్మ, భారతి, సారమ్మ, రజియా, రాణి పాల్గొన్నారు.

నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం..

- కలెక్టర్ ప్రావీణ్య



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

నర్సంపేట రూరల్: అకాల వర్షం, వడగళ్లతో దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురిజాల గ్రామంలో రెండు రోజుల క్రితం కురిసిన వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వడగళ్ల వర్షంతో చేతికొచ్చిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దీనిపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రైతులకు పరిహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గోడిశాల మమతసదానందం, తహసీల్దార్ రామ్మూర్తి, మండల వ్యవసాయాధికారి కృష్ణకుమార్, ఏఈఓలు, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మేకులు మింగి.. తప్పించుకుని..

- సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రి నుంచి రిమాండ్ ఖైదీ పరారీ
- సెంట్రీ నిర్లక్ష్యమే అంటున్న అధికారులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: మేకులు(స్క్రూలు) మింగిన ఓ రిమాండ్ ఖైదీని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. సెంట్రీ కళ్లుగప్పి పరారైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన సీహెచ్.అరవింద్ పలు దొంగతనం కేసుల్లో నిందితుడు. అతన్ని కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేయగా.. ఖమ్మం జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో జరిగిన ఓ దొంగతనం కేసులో పీటీ వారెంట్‌పై తీసుకొచ్చిన పోలీసులు సంగారెడ్డి సెంట్రల్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు. అరవింద్ శనివారం జైలులో మేకులు మింగడంతో జైలు అధికారులు చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మేల్ సర్జికల్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి బాత్‌రూంనకు వెళ్లి వస్తానని చెప్పిన అరవింద్ బాత్‌రూంలో ఉన్న కిటికీ ఊచను తొలగించి అందులోంచి పరారు అయినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు సంగారెడ్డి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పరారీలో ఉన్న అరవింద్‌ను పట్టుకునేందుకు మూడు బృందాలను నియమించినట్లు పోలీసులు తెలిపారు. అరవింద్‌పై తొమ్మిది దొంగతనం కేసులు ఉన్నాయి.

జైలులో మేకులెలా దొరికాయి?

సంగారెడ్డి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అరవింద్‌కు జైలులో మేకులు ఎలా దొరికాయనేది ప్రశ్నార్థకంగా మారింది. జైలులో ఉండే స్విచ్‌బోర్డుకు ఉన్న స్క్రూలను మింగినట్లు జైలు అధికారులు భావిస్తున్నారు. అరవింద్ కడుపు నొస్తుందని జైలు అధికారులకు చెప్పగా.. ఆయన్ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ఎక్స్‌రే తీయడంతో ఆయన కడుపులో రెండు మేకులు ఉన్నట్లు గుర్తించారు. అబ్జర్వేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో సెంట్రీ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే అరవింద్ తప్పించుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. రిమాండ్ ఖైదీలు బాత్‌రూం వెళితే తప్పనిసరిగా చేతులకు గొలుసులు వేయాల్సి ఉంటుంది. అయితే ఏఆర్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అరవింద్ పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు.

ఇంటర్ పరీక్షకు 326 మంది గైర్హాజరు

కాశోజీ సెంటర్: జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు మంగళవారం 326 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ కాక మాధవరావు తెలిపారు. 27 కేంద్రాల్లో మొత్తం 6,979 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 6,653 మంది రాశారని, 326 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జనరల్‌లో 269, ఒకేషనల్ కోర్సులో 57 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

నర్సంపేట రూరల్: రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన రాజుపేట శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా కొడిశలకుంట శివారు మాన్‌సింగ్‌తండాకు చెందిన అజ్మీర మంగు నర్సంపేటకు బైక్‌పై వచ్చి కొడిశలకుంట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నర్సంపేటకు చెందిన చింత లతన్, నాగుల బుల్లబ్బాయి బైక్‌పై నర్సంపేట వైపు వస్తున్నారు. వీరి వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో లతన్, బుల్లబ్బాయికి గాయాలు కాగా.. మంగుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం వీరిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

'పెద్ది' ఇబ్బందే..!



బురదలో కూరుకుపోయిన ఎమ్మెల్యే వాహనాన్ని తోస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

దుగ్గొండి: అడవిరంగాపురం గ్రామంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల పరిశీలనకు సీఎం కేసీఆర్ రానున్న దృష్ట్యా హెలిప్యాడ్‌ను పరిశీలించడానికి మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పెద్ది మంగళవారం వచ్చారు. పరిశీలించిన అనంతరం తిరిగి వెళ్తుండగా హెలిప్యాడ్ సమీపంలో నేల ఒక్కసారిగా కుంగిపోవడంతో ఎమ్మెల్యే పెద్ది వాహనం అందులో ఆగిపోయింది. దీంతో ఎమ్మెల్యే.. జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ వాహనంలో నర్సంపేటకు వెళ్లారు. తర్వాత బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే వాహనాన్ని తోసి బయటకు తీశారు.



వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. గొర్రెకుంటలో ప్రమోద్, కాజీపేటలో గుర్తుతెలియన వ్యక్తి మృతి చెందారు.

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలోని ఓ రైస్‌మిల్లు రేకులు కప్పడానికి పైకెక్కిన ఆపరేటర్ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం.. 15వ డివిజన్ గొర్రెకుంటకు చెందిన కామగోని ప్రమోద్ (32) అదే గ్రామంలోని జయ రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు మిల్లు పైకప్పు రేకులు పగిలిపోయాయి. దీంతో మంగళవారం ఉదయం పాత వాటిని తొలగించి కొత్తవి వేస్తుండగా ప్రమాదశాత్తు కిందపడి తలకు బలమైన గాయమైంది. స్థానికులు గమనించి ఎంజీఎంలో చేర్పించిన కొద్ది సమయానికి మృతి చెందాడు. మృతుడి భార్య రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాజీపేటలో గుర్తు తెలియని వ్యక్తి..



కాజీపేట: కాజీపేట పట్టణంలో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తిని చికిత్స నిమిత్తం ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం.. కాజీపేట రైల్వే జంక్షన్ ప్రాంతంలో ఓ వ్యక్తి పడిపోయి ఉన్నట్లుగా అందిన సమాచారం మేరకు రెండు రోజుల క్రితం ఎంజీఎంలో చేర్పించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచడం జరిగిందని, వివరాలు తెలిసిన వారు 87126-85122, 87126-85246, 87126-85008 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

కూతురిని కాలేజీకి పంపించేందుకు వెళ్తూ..

- కుమార్తె కళ్లముందే ప్రాణాలు విడిచిన తండ్రి
- కారును ఢీకొట్టిన లారీ
- రైతు మృతి, ఒకరికి గాయాలు


కారులో మృతి చెందిన శ్రీనివాసరావు


క్షతగాత్రురాలు శృతి


శ్రీనివాసరావు (ఫైల్)

ఏటూరునాగారం: కన్నబిడ్డను కాలేజీకి పంపుదామని బయలుదేరిన ఆ తండ్రిని విధి కబలించింది. కళ్లముందే తండ్రి ప్రాణాలు కోల్పోవడంతో కుమార్తె గుండెలవిసేలా రోదించింది. తనను సాగనంపడానికి వచ్చి కానరానిలోకాలకు పోతివా.. అంటూ కన్నీరుమున్నీరుగా విలపించింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రొయ్యూర్ సమీపంలోని 163 జాతీయ రహదారిపై మంగళవారం కంటైనర్ లారీ కారును ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న రైతు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. వెంకటాపురం(కె) చెందిన పోలిన శ్రీనివాసరావు (58) తన కుమార్తె పోలిన శృతిని హైదరాబాద్‌లోని కాలేజీకి పంపించేందుకు తన కారులో ఇంటి నుంచి బయలుదేరారు. ఇదే క్రమంలో 163 జాతీయ రహదారిపై ఇసార్ పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. కుమార్తె శృతికి తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో ములుగు వెళ్తున్న వెంకటాపురం జెడ్పీటీసీ పాయం రమణ ప్రమాద స్థలానికి చేరుకుని గాయపడిన శృతిని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తన వాహనంలో తీసుకువచ్చి చికిత్స అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై ఇందయ్య పరిశీలించి కారులో ఇరుక్కుపోయి శ్రీనివాసరావు మృతదేహాన్ని బయటకు తీసి ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు.







నకిలీ వేబిల్లులపై కొనసాగుతున్న దర్యాప్తు


మాట్లాడుతున్న జీఎం పాండురంగారావు

ఏటూరునాగారం: ఇసుక క్వారీల నకిలీ వే బిల్లుల వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఎండీసీ) జీఎం పాండురంగారావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని టీఎస్ఎండీసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇసుక క్వారీల నుంచి దొంగ వే బిల్లులకు సంబంధించి దర్యాప్తు జరుగుతుందని, ఇసుక డంపులు , దొంగ బిల్లులు క్రియేట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వానికి, శాఖకు చెడ్డ పేరు తీసుకువచ్చిన వారిని ఎట్టి పరిస్థితిలో వదిలిపెట్టేది లేదన్నారు. వాజేడు, వెంకటాపురం(కె) ఇసుక క్వారీలను పరిశీలించామన్నారు. మరో ఐదు క్వారీలు వెంకటాపురం, మంగపేట మండలాల్లో మంజూరు అవుతున్నట్లు జీఎం పాండురంగారావు తెలిపారు. ఈ సమావేశంలో పీఏ ఎల్లయ్య, ఏపీఓ శంకరయ్య తదితరులు ఉన్నారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

జనగామ: ఏపీ రాష్ట్రం నుంచి తెలంగాణకు గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు స్మగ్లర్లను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ పి.సీతారం తెలిపారు. జనగామ డీసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తరిగొప్పులకు చెందిన మటన్ వ్యాపారి ఎండీ జలీల్, కొడకండ్ల మండలం రెగ్యులతండాకు చెందిన ప్రైవేట్ డ్రైవర్ కేలోతు నవీన్, అదే తండాకు చెంది కేలోతు చందూలాల్ ముగ్గురు వ్యక్తులు గంజాయికి అలవాటు పడి, చిన్న స్థాయి బిజినెస్‌గా మార్చుకున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేస్తూ.. రహస్యంగా ఇక్కడకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను టార్గెట్ చేస్తూ... గంజాయి తాగడం అలవాటు చేస్తున్నారు. ఇందులో గంజాయికి అలవాటు పడిన కొంత మందిని అమ్మకం కోసం వినియోగించుకుంటున్నారు. ముగ్గురు స్మగ్లర్లు తమ గంజాయి వ్యాపార సామ్రాజ్యాన్ని రోజురోజుకూ విస్తరించుకుంటూ పోతున్నారు. వీరి ఉచ్చులో పడి వందల సంఖ్యలో గంజాయికి అలవాటు పడి బానిసలుగా మారినట్లు స్పష్టం చేశారు. జిల్లాలోని పలు మండలాలకు సైతం గంజాయిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. గంజాయి అమ్మకాలు చేస్తున్నారనే పక్కా సమాచారంతో మంగళవారం నర్మెట ఎస్సై ఎస్‌కె జానీపాష, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో మండల కేంద్రం శివారు పెట్రోల్ బంకు వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో.. వెంటనే పట్టుకుని విచారించగా వారివద్ద రూ.85 వేల విలువ చేసే 4.250 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి, అదుపులోకి తీసుకుని.. రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇందులోని లింకులపై ప్రాథమిక విచారణలో గుర్తించడం జరిగిందని, త్వరలోనే ఒక్కొక్కటిగా బయటకు తీస్తామన్నారు. గంజాయి సేవిస్తున్న 42 మంది పిల్లల తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సెలింగ్ ఇస్తామని, అప్పటికి పద్ధతి మార్చుకోకపోతే కఠిన శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. గంజాయి స్మగ్లర్లను పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, జనగామ, నర్మెట సీఐలు ఎలబోయిన శ్రీనివాస్, నాగబాబు, ఎస్సైలు నవీన్, జీనత్, సృజన్, కానిస్టేబుల్ రామన్న, మహేష్, కర్ణాకర్ తదితరులు ఉన్నారు.





'ఏకశిల'లో ఉగాది వేడుకలు


ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెంబర్తి శివారులోని ఏకశిల టెక్నో స్కూల్‌లో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం సాంప్రదాయ వేషధారణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుని పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి విశిష్టతను వివరించారు. అనంతరం ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ హిందువుల తొలి పండుగ ఉగాది అన్నారు. ఈ శోభకృత్ నామ సంవత్సరంలో తెలుగు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏకశిల పాఠశాల డైరెక్టర్ గౌరు సువిజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జి.ఫణి మోహన్‌రావు, ఏఓ రాంప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి

రామన్నపేట: భార్య అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో భర్త భార్యను కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడగా సదరు వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఇంతేజార్ గంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరి నాగమణి (30) సుధాకర్ అనే వ్యక్తితో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం వరంగల్ లక్ష్మిపురంలో నివాసముంటున్నారు. గత కొద్ది రోజులుగా భార్యభర్తల మధ్య గొడవ జరుగుతుండటంతో ఎనిమిది నెలల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో భార్య అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో ఈ నెల 18న ఉదయం భార్యను చంపాలనే ఉద్దేశ్యంతో వెంట తెచ్చుకున్న కూరగాయల కత్తితో నాగమణిని పొడిచాడు. ఇది గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నారాయణనగర్ కాలనీలో నివాసం ఉండే సుతారి కూలి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టౌన్ ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణనగర్‌కాలనీకి చెందిన సుతారి కూలి దుస్స వీరన్న (32) ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

